

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల జిల్లా వార్తలు 5

శుక్రవారం 20 డిసెంబరు 2024



పెంచికలపాడు సీసీఐ కేంద్రం వద్ద కొనుగోలు చేసిన పత్తి

సీసీఐ కేంద్రాల్లో దళారులు

- జిన్నింగ్ మిల్లు యజమానులు చెప్పిందే వేదం
- 2 లక్షల హెక్టార్లలో సాగైన పత్తి 70 శాతం ప్రైవేటు వ్యాపారులకే
- నామ్‌కే వాస్తేగా సీసీఐ కొనుగోళ్లు
- తేమ రంగు మారిందని సాకులతో వద్దంటున్న అధికారులు
- దళారులు ఇచ్చేది రూ.6వేల నుంచి రూ.6,500 వరకే

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈ సంవత్సరం 2 లక్షల హెక్టార్లలో పత్తి పంట సాగైంది. గత దశాబ్ద కాలంగా రాని దిగుబడి ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వచ్చింది. అయితే.. దిగుబడి బాగున్నా ధర లేదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 15 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే.. నంద్యాల జిల్లాలో ఒక్క కేంద్రం కూడా ఏర్పాటు కాక ఆ జిల్లా రైతులు మద్దతు ధరను పొందేందుకు కర్నూలు జిల్లాలోని పెంచికలపాడు సీసీఐ కేంద్రం వద్ద పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. సీసీఐ కేంద్రంలో క్వింటం పత్తికి రూ.7,521 లభిస్తుందన్న ప్రచారం తప్ప.. వాస్తవానికి ఆ ధర ఇవ్వడం లేదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. సీసీఐ కేంద్రాల్లో దళారులు తిష్ట వేసి రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు న్యాయం జరగడం లేదు. తేమ శాతం 8 నుంచి 12 శాతం లోపు ఉంటేనే ఈ ధర ఇస్తున్నారు. ప్రస్తుతం ముసురుతో పాటు మంచు కురుస్తుండటం వల్ల మినిమం ఈ తేమ ప్రతి రైతు తెచ్చిన పత్తికి ఉండటం వల్ల సీసీఐ కేంద్రం వారు ఏ మాత్రం నిబంధనలను సడలించేది లేదని రైతులను వెనక్కి పంపించేస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గత నెల కేంద్ర మంత్రికి నిబంధనలను సడలించి సీసీఐ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని లెటరు రాశారు. ఒక వారం రోజుల పాటు సీసీఐ అధికారులు కొంత వరకు నిబంధనలను సడలించినా ఈ నెల మొదటి వారం నుంచి తేమ నిబంధనల ప్రకారమే ఉండాలని గిరిగీశారు. దీంతో రైతులు దళారులను జిన్నింగ్ మిల్లులను ఆశ్రయించి ఎంతకో కొంత మేర అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. 2 లక్షల హెక్టార్లలో (6 లక్షల ఎకరాలు) సాగు చేసిన పత్తి పంటకు ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున 48 లక్షల క్వింటాళ్ల పత్తి రైతుల చేతికి అందింది. ఇందులో 35 లక్షల క్వింటాళ్ల దాకా పత్తి దళారులు, జిన్నింగ్ మిల్లులకే రైతులు అమ్ముకున్నారు. మిగిలిన 10 నుంచి 12 లక్షల క్వింటాళ్ల పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది.



సీసీఐ కేంద్రం వద్ద పత్తి రైతుల పడిగాపులు

మిగతా 6లో..

దళారులకే పంట

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈసారి ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట వాతావరణం అనుకూలించి రైతులకు దిగుబడి చేతి నిండా అందింది. సంతోషంతో రైతులు సంబరం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటానికి రూ.7,521 అందుతుందని సంతోషించారు. వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటే అయింది. కర్నూలు జిల్లాలో 12 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు కాగా, నంద్యాల జిల్లాలో ఒక్క కేంద్రం కూడా ఏర్పాటు కాలేదు. అయితే.. కర్నూలు జిల్లాలో 12 కేంద్రాలు ఉన్నా పది శాతం పత్తిని మాత్రమే రైతులు సీసీఐకి అమ్ముకోగలిగారు. నంద్యాల జిల్లా రైతుల పరిస్థితి మరీ దారుణం. ఈ గడ్డు పరిస్థితుల్లో రైతులు దళారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులను ఆశ్రయించక తప్పలేదు. సీసీఐ అధికారులు, మార్కెట్ కమిటీల అధికారులతో వ్యాపారులు దళారులు ముందే ఒప్పందం చేసుకున్నారు. కేంద్రాల వద్ద దళారులు తిష్ట వేశారు. పెంచికలపాడు కేంద్రం వద్ద రైతులకంటే దళారులే ఎక్కువ సంఖ్యలో కనిపించడం దారుణం. గ్రామాల్లో దళారులు, వ్యాపారులు తిష్ట వేసి రైతులకు అడ్వాన్సులు ఎర వేసి క్వింటానికి రూ.6వేలు మాత్రమే చేతుల్లో పెడుతున్నారు. రైతుల పాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు తీసుకుని నేరుగా లారీల్లో పెంచికలపాడు సీసీఐ కేంద్రానికి వెళ్లి అక్కడ పత్తిని అమ్మి క్వింటంపై రూ.7,521 లబ్ధి పొందుతున్నారు. ఈ ప్రకారంగా క్వింటానికి రూ.1000 లాభం వస్తుంది. ఈ లాభంలో వ్యాపారులు కొంత మొత్తం మార్కెటింగ్ శాఖ అధికారులకు, సీసీఐ అధికారులకు ఇస్తుండటంతో ఈ భాగోతం ఎవరికీ తెలియడం లేదు. మద్దతు ధర అందుతుందో లేదో నిఘా పెట్టడంలో విజిలెన్స్ విభాగం అధికారులు పెద్దగా శ్రద్ధ తీసుకోవడం లేదు.

కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడిగా బన్నూరు ఖరారు

- పేరును ప్రతిపాదించిన సీఎం చంద్రబాబు
- సమ్మతించిన ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాల ఎమ్మెల్యేలు



బన్నూరు రామలింగారెడ్డి పేరును ప్రతిపాదిస్తూ సీఎం చంద్రబాబును కలిసిన కడప, కర్నూలు ఎమ్మెల్యేలు

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు - కడప కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి పేరును ప్రతిపాదిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ విషయంపై గురువారం ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలకు చెందిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య, గౌరు చరిత, వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖరగౌడ్, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా బన్నూరు రామలింగారెడ్డి పేరును సమష్టిగా ప్రతిపాదించారు. 21వ తేదీ శనివారం నంద్యాలలోని కేసీ కెనాల్ ఈఈ కార్యాలయంలో కేసీ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక జరగనుంది. కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలోని మొత్తం 14 డీసీలకు చెందిన సభ్యులు ఓటింగ్‌లో పాల్గొంటారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 8డీసీలు ఉండగా, కడప జిల్లా పరిధిలో 6డీసీలు ఉన్నాయి. కాగా అన్ని డీసీల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందడంతో కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడిగా కేసీసీ-3 వేల్పనూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ నుంచి ఎన్నికైన బన్నూరు రామలింగారెడ్డి ఎన్నిక కూడా ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయి.

రాయల్టీ లేదని ఆపేశారు



ట్రాక్టర్ల యజమానులు డ్రైవర్ల నిరసన

బేతంచెర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాపరాళ్ల గనుల నుంచి బేతంచెర్ల ఫ్యాక్టరీలకు నాపరాళ్లు రవాణా చేసే ట్రాక్టర్ల డ్రైవర్లు రాయల్టీ లేకుండా రావడంతో అధికారులు గురువారం అడ్డుకున్నారు. లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లను బేతంచెర్లలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నిలుపుదల చేశారు. దీంతో డ్రైవర్లు, యజమానులు నాపరాళ్ల ట్రాక్టర్లను బనగానపల్లె-డోన్ రహదారిపై నిలిపివేసి ఆందోళన చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాపరాళ్ల గనుల నుంచి రవాణా చేసే ప్రతి ట్రాక్టర్‌కు గతంలో రూ.500 రాయల్టీ చెల్లించేవారు. ఇప్పుడు రూ.200లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయరెడ్డి తనిఖీలు చేపట్టారు. రాయల్టీ లేని ట్రాక్టర్లు, తక్కువ రాయల్టీ చూపించిన ట్రాక్టర్లను నిలిపివేయించారు. దీంతో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేయడంపై రహదారిపై రాకపోకలు స్తంభించాయి. దీనికి తోడు రైల్వేగేటు కూడా వేయడంతో వాహనాలతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. చివరకు ట్రాక్టర్ల యజమానులు నాపరాళ్ల లోడు ట్రాక్టర్లకు పెరిగిన మొత్తంతో రూ.700 చెల్లించి రాయల్టీ తీసుకుని రాగా ట్రాక్టర్లు యథావిధిగా కొనసాగాయి. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ విషయంపై రాయల్టీ అధికారి రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ తాను ఏమీ చేయలేనని రాయల్టీని ప్రభుత్వం పెంచిందన్నారు. పూర్తిస్థాయిలో రాయల్టీ ఉంటేనే ట్రాక్టర్లను పంపగలనని తెలిపారు.

అధికారులు ఏం చేస్తున్నారు..?

- భూ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం
- 15 ఏళ్ల నుంచి పెండింగ్‌లోనే
- రెవెన్యు సదస్సులో కలెక్టర్ రాజకుమారి అసహనం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ప్యాపిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా వ్యాప్తంగా భూ సమస్యలు అధికంగా ఉన్నాయి. ఆ సమస్యలను పరిష్కరించకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. 15 సంవత్సరాల నుంచి కూడా సమస్యలు అలాగే ఎందుకు ఉండిపోయాయి..' అంటూ కలెక్టర్ రాజకుమారి అధికారులను ప్రశ్నించారు. గురువారం ప్యాపిలి మండలంలోని బూరుగుల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన కలెక్టర్ రాజకుమారి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తాను పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించానన్నారు. అయితే నంద్యాల జిల్లాలో ఉన్న భూ సమస్యలు ఎక్కడా చూడలేదన్నారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్లే భూ సమస్యలు పేరుకుపోయాయన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్దకు ప్రజలు తిరగాల్సిన అవసరం లేదన్నారు. వారి వద్దకే అధికారులు వెళ్లి సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. రెవెన్యు సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారం చూపుతామన్నారు. అలాగే రైతుల అభిప్రాయాల ప్రకారం ప్రభుత్వం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌బుక్‌లను రైతులకు అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భువనేశ్వరిదేవి, తహసీల్దారు భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈవోఆర్డీ బాలకృష్ణుడు, ఏఓ రాజేష్, ఏఈ వినయ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్, ఎంపీటీసీ శివకుమారి, వీఆర్వో సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల లక్ష్యం నెరవేరేనా..?

- ఆత్మకూరు మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 48.64శాతమే వసూలు
- నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్ అధికారులు
- పేరుకుపోయిన ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీలో పన్నుల వసూళ్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు 50 శాతం కూడా పన్నులు వసూలు చేయలేదు. వాస్తవానికి ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 11,346 మంది పన్ను చెల్లింపుదారుల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,50,85,557 విలువ గల ఇంటి, కుళాయి, వాణిజ్య, ఖాళీ స్థలాలు తదితర పన్నులను వసూలు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు రూ.1,22,02,665 (48.64శాతం) మాత్రమే ప్రజలు పన్నులు చెల్లించారు. ఇంకా రూ. 1,28,82,892 పన్నులను చెల్లించాల్సి ఉంది. ఇవే కాకుండా ఇప్పటి వరకు మున్సిపాలిటీకి గడిచిన ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.4,75,97,722 బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో 87 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు సంబంధించి రూ.52,61,605 బకాయిలు ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.6,31,291 ఉన్నాయి. అదే క్రమంలో కేంద్ర ప్రభుత్వానికి రూ.68వేలు బకాయిలు ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.11వేలు చెల్లించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ పన్నును ఏడాదిలో రెండు విడతల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరునెలలకు తొలి విడత, అక్టోబరు నుంచి మార్చి వరకు రెండో విడత చెల్లించే అవకాశం ఇచ్చారు. ఏడాది పన్ను ఏప్రిల్ నెలలో చెల్లిస్తే 5శాతం రాయితీ ఇస్తారు. అదే విధంగా ఆరునెలల విడతల్లో తొలి మూడు నెలల్లో పన్ను చెల్లిస్తే వడ్డీ భారం నుంచి వెసులుబాటు ఇస్తున్నారు.

సకాలంలో పన్ను చెల్లిస్తే అపరాధ రుసుమును మినహాయింపు



ఆత్మకూరు పట్టణ ప్రజలు ఈ ఆర్థిక సంవత్సరం పన్ను డిసెంబర్ 31వ తేదిలోగా చెల్లిస్తే అపరాధ రుసుము నుంచి మినహాయింపు ఉంటుంది. సకాలంలో పన్ను చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగం కావాలి. పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు బిల్ కలెక్టర్లతో పాటు వార్డు సచివాలయ ఉద్యోగులను నియమించాం. అలాగే ప్రజలకు తెలియజేసేందుకు ప్రచార కార్యక్రమాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాము.

- రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పన్ను చెల్లించడంలో అలసత్వం వహిస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే అలాంటి వారికి నోటీసులు జారీ చేయగా కుళాయిలు ఉన్న వారికి కనెక్షన్లను కట్ చేస్తున్నారు. అయినప్పటికీ స్పందించినట్లయితే అలాంటి వారికి విద్యుత్, కేబుల్ తదితర సేవలను నిలిపి వేయడంతో పాటు ఇంటి జప్తునకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా ఇద్దరు మున్సిపల్ బిల్ కలెక్టర్లతో పాటు ఆయా వార్డుల సచివాలయాల సిబ్బందిని నిరంతరం పన్ను చెల్లింపుదారుల ఇళ్ల వద్దకు పంపించి వసూలుపై ప్రత్యేక దృష్టి సారించారు. అయినా పన్ను చెల్లించడానికి సిద్ధం కాని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. అదేక్రమంలో పెండింగ్ బకాయిల వసూళ్లపై కూడా మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రత్యేకించి ప్రభుత్వ కార్యాలయాలకు రూ.58,92,896 పన్నులు బకాయిలు ఉండగా అందులో పోలీసు క్వార్టర్స్ రూ.8.18 లక్షలు, పోలీసుస్టేషన్ రూ.6.88 లక్షలు, డీఎస్పీ కార్యాలయం రూ.3.66 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం రూ.2.26 లక్షలు, సబ్ రిజిస్టర్ ఆఫీసు రూ.3.77 లక్షలతో పాటు మరిన్ని కార్యాలయాల లక్షలరూపాయాల్లో పన్ను బకాయిలు పేరుకుపోవడంతో ఆయా శాఖలకు కూడా నోటీసులు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇదిలా వుంటే ఇప్పటికే తొలివిడతలో పన్ను చెల్లించని వారిపై నెలకు 2శాతం చొప్పున వడ్డీ భారం పడనుంది. అదేక్రమంలో రెండో విడతలో కూడా డిసెంబరులోగా పన్ను చెల్లించపోతే అదనంగా వడ్డీ భారం పడనుంది. ఈ నేపథ్యంలో డిసెంబరులోగా పన్నులు చెల్లిస్తే వడ్డీకి మినహాయింపు పొందవచ్చునన్న విషయాన్ని ప్రజలకు తెలియపరిచేలా మున్సిపల్ అధికారులు విస్తృతమైన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇంత చేసినా .. పన్ను వసూళ్లలో అధికారులు నిర్ణయించిన లక్ష్యం నెరవేరుతుందో లేదో వేచి చూడాల్సిందే.




పన్ను చెల్లిస్తున్న దృశ్యం



వియోగి ఇకలేరు..! అనారోగ్యంతో ప్రముఖ రచయిత కన్నుమూత 7

పీసీ పీఠం ఎవరికో..?
- రేపే ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు
- టీబీపీ ఎల్లెల్సీ పీసీ చైర్మన్ స్థానానికి పోటీ
6

సాగునీటి సంఘాల ఎన్నికల్లో చివరి ఘట్టానికి సమయం ఆసన్నమైంది. మూడు దశల్లో జరిగే ఎన్నికల్లో సాగునీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యూయూఏ), డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలు ఇప్పటికే పూర్తి అయ్యాయి. ఇక కీలకమైన ఎల్లెల్సీ జీడీపీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ రెండు ఎన్నికలు జలమండలి కార్యాలయంలో జరగనున్నాయి. ఎన్నికల నోడల్ అధికారి, ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి. బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికకు సంబంధించి తాజాగా కలెక్టర్ పి. రంజిత్ బాషా నోటిఫికేషన్ జారీ చేశారు.



జీడీపీ పీసీ చైర్మన్ కేఈకేనా?

గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ పరిధిలో 12 డబ్ల్యూయూఏలు ఉన్నారు. పీసీ చైర్మన్‌గా కోడుమూరు డబ్ల్యూయూఏ-2 అధ్యక్షుడు కేఈ మల్లికార్జున గౌడు పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. కృష్ణగిరి మండలం పోతుగల్లు డబ్ల్యూయూఏ అధ్యక్షుడు సోములగౌడు కూడా ఆశించినా, మల్లికార్జున గౌడుకే ముఖ్యమైన నాయకులు మద్దతు ఇవ్వడంతో ఆయన ఎంపిక లాంఛనమే అని టీడీపీ వర్గీయులు అంటున్నారు. ఈ విషయంపై శుక్రవారం సాయంత్రానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

- రేపే ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు
- టీబీపీ ఎల్లెల్సీ పీసీ చైర్మన్ స్థానానికి పోటీ
- గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీపై సర్వత్రా ఆసక్తి
- టీడీపీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్

పీసీ పీఠం ఎవరికో..?

కర్నూలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు 17వ తేదీ మంగళవారం ముగిశాయి. ఎల్లెల్సీ పరిధిలో హోళగుంద డీసీ-1, కౌతాళం డీసీ-2, కోసిగి డీసీ-3, పెద్దకడుబూరు డీసీ-4, ఎమ్మిగనూరు డీసీ-5, 6, గోనెగండ్ల డీసీ-7, కోడుమూరు డీసీ-8, కర్నూలు డీసీ-9, 10 అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. పది మంది డీసీ అధ్యక్షులు సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నిక జరగాలంటే కనీసం ఐదుగురు హాజరు కావాలి. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు కమిటి పరిధిలో 12 మంది డబ్ల్యూయూఏలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో కనీసం 50 శాతం అంటే ఆరుగురు డబ్ల్యూయూఏల అధ్యక్షులు హాజరు కావాలని ఎన్నికల నిర్వహణ అధికారులు పేర్కొంటున్నారు. మరో పక్క..

అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికో..?

టీబీపీ-ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ (పీసీ) చైర్మన్ ఎవరన్నది టీడీపీ వర్గాల్లో ప్రధానంగా జరుగుతున్న చర్చ. ఈ రెండు పీసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపికలో మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జిల ఏకాభిప్రాయం నిర్ణయం ఎంతో కీలకం. అయితే జిల్లాలో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, 195 గ్రామాలకు తాగునీరు అందించే ఎల్లెల్సీ పీసీ చైర్మన్ పీఠం కోసం హోళగుంద డీసీ అధ్యక్షుడు మిక్కిలినేని వెంకట శివప్రసాద్, కౌతాళం డీసీ అధ్యక్షుడు పి.టిప్పుసుల్తాన్, పెద్దకడుబూరు డీసీ అధ్యక్షుడు నరవ రమాకాంత్ రెడ్డి, ఎమ్మిగనూరు డీసీ-6 అధ్యక్షుడు గోవర్దన్ రెడ్డి, కర్నూలు డీసీ-9 అధ్యక్షుడు కే.మహేశ్వరరెడ్డిలు ఎల్లెల్సీ పీసీ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. పోటీ అధికంగా ఉండటంతో చైర్మన్ అభ్యర్థి ఎంపిక బాధ్యతను పార్టీ అధిష్ఠానానికి వదిలేశారు. అధినేత సీఎం చంద్రబాబు ఆశీస్సులు ఉన్న వారే చైర్మన్ అయ్యే అవకాశం ఉంది. దీంతో పీసీ పీఠం ఎవరికి దక్కుతుందా? అన్న ఆసక్తి నెలకొంది.



అధినేత నిర్ణయమే ఫైనల్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా సాగునీటి సంఘం అధ్యక్షుడి ఎంపిక అధినేత చంద్రబాబు నిర్ణయమే అంతిమమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి స్పష్టం చేశారు. గురువారం కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన టీసీ, డీసీ సభ్యులను, గెలుపునకు కృషి చేసిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలను సన్మానించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మద్దతు పలికిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపికపై సమావేశంలో చర్చించారు. నియోజకవర్గాల వారీగా నాయకులు సూచించిన పేర్లను పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్దన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు బి.వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి తదితరులను ఘనంగా సత్కరించారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

సన్నజాజి.. రేటు జాస్తి



రుద్రవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సన్నజాజి పూల ధర ఆకాశాన్నంటుతోంది. కిలో రూ.800 నుంచి వెయ్యి పలుకుతోంది. వ్యాపారులు సైతం వీటిని కొనాలంటే జంకుతున్నారు. ఇంత ధర పెట్టి కొనడానికి ఎవరూ ముందుకు రారని వారు పేర్కొంటున్నారు. సాగు తక్కువ కావడమే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. పైగా సన్నజాజి పూలకు మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉండడం కూడా మరో కారణంగా చెప్పవచ్చు.

ఆక్రమణదారుడిపై కేసు నమోదు చేయండి

జాయింట్ కలెక్టర్ నవ్య

వెల్దుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పొలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ నవ్య తహసీల్దార్ చంద్రశేఖరవర్మను ఆదేశించారు. గురువారం వెల్దుర్తి మండలం ఎస్. బోయనపల్లె గ్రామంలో సచివాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ నవ్య పాల్గొన్నారు. అబ్దుల్ హుసేన్ అనే రైతు జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చాడు. ఇందులో ఆయన... సర్వే నెంబరు 9లో 3 ఎకరాలు ప్రభుత్వం తనకు డీ పట్టా ఇచ్చిందన్నారు. టైటిల్ డీడ్, అడంగల్, పాసుబుక్‌లో రికార్డుపరంగా అన్నీ తనకు ఉన్నాయని, అయితే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన భూమిని ఆక్రమించాడని జాయింట్ కలెక్టర్ నవ్యకు విన్నవించుకున్నాడు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ... కబ్జా చేసిన వ్యక్తిపై 109 సీఆర్పీసీ సెక్షన్ కింద బైండోవర్ కేసు నమోదు చేయాలని తహసీల్దార్ చంద్రశేఖరవర్మను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు కాంతారెడ్డి, సర్వేయర్ హేమంత్‌రెడ్డి, ఆర్ఐమస్తాన్, విఆర్వో ఉమన్న, సిబ్బంది పాల్గొన్నారు.


రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

ఉత్తమ సేవలకు ఉపాధ్యాయ రత్న అవార్డు

హైకోర్టు జడ్జి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అద్దంకి చంద్రమోహన్

తుగ్గలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు చదువు చెప్పడంలో అంకిత భావం ప్రదర్శించినందుకు అద్దంకి చంద్రమోహన్‌కు ఉపాధ్యాయ రత్న అవార్డును ప్రకటించారు. మండలంలోని లక్ష్మీతాండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అద్దంకి చంద్రమోహన్ హైదరాబాదులో ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అందించిన ఉపాధ్యాయ రత్న అవార్డును హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ రత్న పురస్కారం అవార్డుకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. గిరిజన విద్యార్థుల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. అవార్డు అందుకున్న చంద్రమోహన్‌ను ఎంపీపీ ఎర్రనాగప్పతో పాటు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.


అవార్డు తీసుకుంటున్న అద్దంకి చంద్రమోహన్

సీసీఐ కేంద్రాల్లో దళారులు



(5వ పేజీ తరువాయి)

నంద్యాల జిల్లాలో సీసీఐ అధికారులు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ జిల్లాలో రైతులు పత్తిని లారీలు, ట్రాక్టర్లలో వ్యయ ప్రయాసలకోర్చి కర్నూలు జిల్లాలోని పెంచికలపాడులోని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఖర్చులకు ఒక ట్రాక్టర్ దాదాపు 5 నుంచి రూ.6వేల దాకా ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. 3, 4 రోజుల పాటు ఆ కేంద్రం వద్ద చలికి ప్రాణాలు పోయేంతగా పడిగాపులు కాస్తున్నా సీసీఐ అధికారులు ఏ మాత్రం కనికరం లేకుండా నిబంధనల పేరుతో కొనుగోలు చేయకుండా వెనక్కి తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఈ విషయాన్ని ముందుగానే పసిగడుతున్న జిన్నింగ్ మిల్లుల యజమానులు, దళారులు తాము గ్రామాల నుంచి తెచ్చిన పత్తిని అదే నిబంధనల ప్రకారం పత్తి లేకున్నా సీసీఐ కేంద్రం వద్ద క్వింటానికి రూ.7,521 దక్కించుకోవడం దారుణం. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెటింగ్ శాఖ అధికారులు, సీసీఐ అధికారులను ప్రశ్నించినా వారికి న్యాయం జరగడం లేదు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పత్తి దాదాపు 70 శాతం దళారులు, జిన్నింగ్ మిల్లుల పరమైపోయింది. కేవలం 30 శాతం మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది.

రైతుల కంటే దళారులే ఎక్కువ

కర్నూలు జిల్లాలో రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేసేందుకు 12 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద రైతులకంటే వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులే అధికంగా ఉండటం విశేషం. వీరు చెప్పిందే వేదం అన్నట్లుగా సీసీఐ అధికారులు వ్యవహరిస్తున్నారు. వారానికి ఒకసారి మార్కెట్ కమిటీల అధికారులు, సిబ్బంది సీసీఐ కేంద్రాలకు ఉజ్జాయింపుగా వెళ్లి వస్తుండటం దారుణం. అధికారులే తమకు తీరని అన్యాయం చేస్తున్నారని, పేరుకే మాత్రమే ప్రభుత్వం మద్దతు ధర అందిస్తున్నట్లు చెప్పుకోవడం తప్పితే.. తమకు ఎక్కడ న్యాయం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


నిబంధనల ప్రకారమే పత్తి కొనుగోలు



కర్నూలు జిల్లాలో రైతుల నుంచి పత్తిని నిబంధనల ప్రకారమే సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తున్నది. 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే ప్రభుత్వం ప్రకటించినట్లు క్వింటానికి రూ.7,521 రైతులకు దక్కుతుంది. తేమ అధికంగా ఉంటే సీసీఐ కొనదు. నిబంధనల మేరకు అర్హులు కాని రైతులు జిన్నింగ్ మిల్లులకు అమ్ముకుంటున్నారు. గ్రామాల్లో దళారులు, ఇతర వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తున్నట్లు తమకు సమాచారం లేదు. దళారులు అమ్ముతున్నట్లు మాకు ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. సీసీఐ కేంద్రాల వద్ద దళారులు తిష్ట వేసినట్లు ఫిర్యాదులు రాలేదు. వివిధ మార్కెట్ కమిటీల అధికారులు, సిబ్బంది సీసీఐ కేంద్రాల వద్దనే ఉండి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

- నారాయణమూర్తి, ఏడీఎం

కాగితాల్లోనే పత్తికి మద్దతు ధర



సీసీఐ కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర వ్యాపారులు, మిల్లుల యజమానులకు తప్పితే.. రైతులకు అందడం లేదు. గ్రామాల్లో దళారులు తిష్ట వేసి క్వింటానికి రూ.6వేల ధరను నిర్ణయిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని సీసీఐ కేంద్రం వద్ద వారే మద్దతు ధరను పొందుతున్నారు. మార్కెట్ కమిటీల అధికారులు, సీసీఐ అధికారులు దళారులతో చేతులు కలపడం వల్లనే రైతులకు అన్యాయం జరుగుతున్నది.

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుకోవాలి


కంది పంటలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతలు వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ అన్నారు. గురువారం బనగానపల్లె సమీపంలోని యాగం టిపల్లె కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేవీకేలో ఎక్కువ మంది రైతులకు సాంకేతికతను అందజేయాలని, అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచించుకోవాలని కోరారు. కేవీకే చేపట్టిన విత్తనోత్పత్తి ప్రద ర్శనా క్షేత్రాలను పరిశీలించారు. నియోజక వర్గంలోని అమడాలో గల కంది రకాలు, కలుగొట్లలోని శనగ విత్తనోత్పత్తి ప్రదర్శనా క్షేత్రాన్ని గుండుపాపలలో సాగు చేసిన మినుము విత్తనోత్పత్తి ప్రదర్శనా క్షేత్రా లను స్వయంగా పరిశీలించారు. మహిళలు నడుపుతున్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ కేంద్రాలను సందర్శించి రైతులకు తగు సూచ నలు చేశారు. సురేశ్‌కుమార్, కెవికె శాస్త్రవేత్తలు రమణ య్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయ ణ, రవిగౌడ్, లక్ష్మిప్రియ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 512 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 27 గ్రామాల్లోని రెవెన్యూ సదస్సుల్లో 512 అర్జీలను స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో 17, నందవరం మండలంలోని ఇబ్రహీంపురంలో 7, ఎమ్మిగనూరు మండలంలోని ఏనుగుబాలలో 26, కోసిగి మండలంలోని ఐరన్‌గల్ గ్రామంలో 28, మంత్రాలయం మండలంలోని మంచాల గ్రామంలో 2, పెద్దకడుబూరు మండలంలోని పీకలబెట్ట గ్రామంలో 9, ఆదోని మండలంలోని చిన్నగోనెహాల్‌లో 11, హొళగుంద మండలంలోని సుల్వాయి గ్రామంలో 16, కోసిగి మండలంలో దేవరబెట్ట గ్రామంలో 28, కౌతాళం మండలంలోని బదినేహాల్‌లో 48, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని కేతవరంలో 17, కల్లూరు మండలంలోని కొంగనపాడు గ్రామంలో 6, వెల్దుర్తి మండలంలోని ఎస్. బోయినపల్లి గ్రామంలో 17, కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో 11, కర్నూలు రూరల్‌లోని ఉల్చాల గ్రామంలో 91, గూడూరు మండలంలోని మల్లాపురం గ్రామంలో 7, సి.బెళగల్ మండలంలోని కుంబజహల్లిలో 5, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలంలోని పత్తికొండలో 25, తుగ్గలి మండలంలోని పగిడిరాయిలో 8 క్రిష్ణగిరి మండలంలోని కంబలపాడులో 41, మద్దికెర మండలం ఎం.అగ్రహారం గ్రామంలో 23, ఆలూరు మండలంలోని కరిడిగండంలో 16, చిప్పగిరి మండలంలో చిప్పగిరిలో 14, ఆస్పరి మండలంలోని నగరూరు లో 19, హాలహర్వి మండలం కమినహాల్‌లో 5, మెడికల్ గ్రామంలో 1, దేవనకొండ మండలంలోని పాలకుర్తిలో 15 అర్జీలు వచ్చాయన్నారు. ఇంటి స్థలాలకు సంబంధించి 1, అలాగే 22ఏలో ఉన్న నిషిద్ధ భూముల జాబితాకు 1, రీ సర్వేకు 55, మీసేవా గ్రీవెన్స్‌కు 8, ఇనాం భూములకు 3, ఆర్వోఆర్ కేసులకు 383, ఇతరాలు 55, రోడ్ల వివాదాలకు సంబంధించి ఒక అర్జీ వచ్చాయన్నారు.

డీఎల్‌డీఓ కార్యాలయంలో సిబ్బంది కొరత

- సచివాలయాల పర్యవేక్షణ జీఎస్‌డబ్ల్యూదే బాధ్యత
- పట్టించుకోని అధికారులు



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఆవరణలోని కర్నూలు డివిజన్ డీఎల్‌డీఓ(డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారి) సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. డివిజన్ పరిధిలోని 7 మండలాలు, రెండు మున్సిపాలిటీలు(కర్నూలు నగర పాలక సంస్థ, గూడూరు మున్సిపాలిటీ)లకు సంబంధించి సచివాలయాల్లో జరుగుతున్న పథకాల అమలును డీఎల్‌డీఓ పర్యవేక్షించాలి. అయితే కార్యాలయంలో డీఎల్‌డీఓతోపాటు పరిపాలన అధికారి, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, అటెండర్ ఉండాలి. ప్రస్తుతం డీఎల్‌డీఓ, పరిపాలన అధికారి, అటెండరు మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం మండలాలలోని సచివాలయాలో జరుగుతున్న పథకాల అమలు తీరును పర్యవేక్షించడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలి. ఈ క్రమంలో ఒక్క పరిపాలన అధికారి వల్ల ఎలా సాధ్యమవుతుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది కొరత..

కార్యాలయ పరిధిలో పర్యవేక్షణ ఉన్నప్పటికీ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రధానంగా గ్రామ, వార్డు సచివాలయాలు, గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ముఖ్యంగా జిల్లా పరిషత్ సీఈఓ జిల్లా మొత్తం పర్యవేక్షిస్తే...డీఎల్‌డీఓ మాత్రం కర్నూలు డివిజన్ వరకు పర్యవేక్షించాల్సి ఉంటుంది. డీఎల్‌డీఓ సచివాలయంలో జరిగే ప్రతి స్కీమ్‌ను మానిటర్ చేయడంతో పాటు ...సచివాలయాలకు వచ్చే ప్రతి జీఓను మెయిన్‌టెయిన్ చేయాలి. అయితే డీఎల్‌డీఓను ఉమ్మడి జిల్లా గ్రామ, వార్డు సచివాలయల పర్యవేక్షణ ఇన్‌చార్జి అధికారిగా కూడా నియమించారు. దీంతో ఆయన రెండు జిల్లాల సచివాలయాలను పర్యవేక్షించాల్సి ఉంది.

- డిప్యుటేషన్ ప్రాతిపదికన నియామకం..

డీఎల్‌డీఓ కార్యాలయంలో జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగులను డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమించాలని గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తాత్కాలికంగానే ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (కుడా) ఫారిన్ సర్వీస్ కింద వెళ్లారు. దీంతో ఆ రెండు పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అంతే కాకుండా గత సంవత్సర కాలంగా టైపిస్టు పోస్టు ఖాళీగానే ఉంది. మిగతా ఉద్యోగులే టైపిస్టు పనులు కూడా చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.


జిల్లా పరిషత్ పాత పరిపాలన భవనంలో ఉన్న డీఎల్‌డీఓ కార్యాలయం

డిప్యుటేషన్ వేయాలని ప్రతిపాదనలు పంపాం..

కార్యాలయంలో ఇబ్బంది కొరత ఉందని ప్రతిపాదనలు సీఈఓకు పంపాం. త్వరలోనే నియమిస్తామని సీఈఓ హామీ ఇచ్చారు. ప్రస్తుతం పనులు సాఫీగానే సాగుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేవు. ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

-జీవీ.రమణారెడ్డి, డీఎల్‌డీఓ, కర్నూలు డివిజన్

ఇద్దరిని నియమించాం



సిబ్బంది కొరత ఉందని డీఎల్‌డీఓ ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఓ సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌ను నియమించాం. త్వరలోనే అక్కడ జాయిన్ అవుతారు. మిగిలిన ఖాళీలను త్వరలోనే పూర్తి చేస్తాం.

-జి. నాసరరెడ్డి, జడ్పీ సీఈఓ

వియోగి ఇకలేరు..!

- అనారోగ్యంతో రచయిత కన్నుమూత
- నవలలు, కథా సంపుటాలతో గుర్తింపు




వియోగి (ఫైల్)

కర్నూలు కల్చరల్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ కథ, నవలా రచయిత 'వియోగి' గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. వియోగి కలం పేరుతో రచనలు చేసిన కోపల్లె విజయ ప్రసాదు (72) శ్వాసకోశ వ్యాధితో బాధపడతూ నగరంలోని శ్రీనగర్‌కాలనీ స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఎల్ఐసీ అధికారిగా 2012లో పదవీ విరమణ చేశారు.1952 జూలై 28న తెనాలిలో జన్మించారు. వృత్తిరీత్యా కర్నూలులో పనిచేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. పలు నవలలు, కథా సంపుటాలు, వందకు పైగా రేడియో నాటికలు రాశారు. ఆయన కథలకు ఎన్నో బహుమతులు లభించాయి. కథా సంకలనాలు, హాస్య కథా సంకలనాలకు ఆయన సంపాదకత్వం వహించారు. 1992లో ఆకాశవాణి జాతీయ అవార్డు, 2016లో రాధాకృష్ణన్ స్మారక అవార్డు, ఎన్‌టీఆర్ అవార్డు, అదే ఏడాదిలోనే లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2017లో కువైట్ తెలుగు కళా సమితి అవార్డులు అందుకున్నారు. ఒకపక్క ఉద్యోగం చేస్తూనే ఎన్నో రచనలు చేశారు. వివాహ వీణ, ధీరనారి, బతుకు మొదలైన నవలలు, విలువలు, రస గుళికలు, మాబామ్మ కథలు మొదలైన కథా సంపుటాలు ఆయనకు పేరు తెచ్చాయి. వియోగి తండ్రి 'శ్రీరాగి', సోదరి డాక్టర్ రమ్య, ధర్మపత్ని విశాలాక్షి కూడా రచయితలే కావడం విశేషం. వియోగి మృతి పట్ల సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా నాయకులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్, నాగమణి, అయ్యన్న, భాస్కర్, విజయులు, అరసం నాయకులు జహీర్ అహ్మద్, పుల్లా రామాంజినేయులు, ప్రమోద్, కవులు స్వరూప్ సిన్హా, మండి అన్వర్ హుస్సేన్, జేఎస్ఆర్‌కే శర్మ, కేసీ కల్కూర, ఇనాయతుల్లా, పౌరోహితం మారుతి, తెలుగు వెంకటేశ్, వెంకటక్రిష్ణ, డాక్టర్ హరికిషన్, నాగాంజనేయులు, రామ్‌చంద్, కల్యాణదుర్గం స్వర్ణలత సంతాపం తెలియజేశారు.

పత్తి అమ్మకానికి పడిగాపులు

- నిలిచిన పత్తి కొనుగోళ్లు
- సీసీఐ కేంద్రం వద్ద రైతుల ఆవేదన
- కొనుగోళ్లు లేక నిలిచిపోయిన పత్తి వాహనాలు



యంత్రానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ రైతు పేరు వెంకటస్వామి. బూడిదపాడు గ్రామం. రెండెకరాల్లో వచ్చిన పత్తి దిగుబడిని పెంచికలపా డులోని సీసీఐ పత్తి కేంద్రంలో అమ్మేందుకు మూడు రోజుల కింద వెళ్లాడు. ఇప్పటికీ అక్కడే పడిగాపులు పడుతున్నాడు. జిన్నింగ్ మిల్లులో ఎక్స్‌కవేటర్ ఒక యంత్రాన్ని ఢీకొట్టడంతో ఆ మిషన్ చెడిపోయి పత్తికొనుగోళ్లు నిలిచిపోయాయి. సోమవారం దాకా కొనుగోళ్లు జరగవని, ప్రస్తుతం టోకెను మాత్రమే ఇస్తామని అధికారులు ప్రకటించడంతో వందలాది మంది రైతులు పెంచికలపాడు కేంద్రం వద్దనే పడిగాపులు కాస్తున్నారు. ఓ వైపు తుఫాను తరుముకొస్తే పత్తి ఎక్కడ తడిసిపోతుందో అని ఆందోళనపడుతున్నారు. రెండు వాహనాల్లో తీసుకొచ్చిన పత్తిని కొనాలని ఈ రైతు అధికారులను బతిమలాడుతున్నాడు. సూపర్‌వైజర్లు శ్రీను, హర్షద్ రైతులందరికీ పత్తి కొనుగోలుకు టోకెన్లు సక్రమంగా అందించేందుకు పర్యవేక్షణ చేస్తున్నారుగాని కొనేందుకు సిద్ధంగా లేరు.



టోకెన్లను చూసుకుంటున్న రైతులు

సోమవారమైనా కొంటారా?

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తుఫాన్ రాయలసీమ వైపు దూసుకు వస్తున్నదని వాతావ రణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. గురువారం సాయంత్రానికి ఆకాశమంతా మబ్బులు కమ్మేశాయి. ఏ క్షణమైనా వర్షం వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ జిల్లా అధికారులు రైతులను హెచ్చ రిస్తున్నారు. పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రెండు జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ఆధారంగా ఉన్న పెంచికల పాడులోని జిన్నింగ్ మిల్లు వద్ద యంత్రం చెడిపోవడంతో కొనుగోళ్లు నిలిపివే శారు. ఇంకో వైపు వర్షానికి, ఉధృతంగా వీచే గాలులకు కోతకు వచ్చిన పంట పెరికేవేసే అవకాశం లేకుండా పోయిందని, ఏ విధంగా పంటను కాపాడుకోవాలో అర్థం కావడం లేదని రైతులు బోరున విలపిస్తున్నారు.



వేచి ఉన్న రైతులు

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

- అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

కర్నూలు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వాదులకు అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని దామోదరం సంజీవయ్య భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగ నిర్మాత చరిత్రను తుడిచిపెట్టే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానించే తీరులో కేంద్ర మంత్రి అమిత్‌షా అవహేళనగా మాట్లాడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆయన వ్యాఖ్యలతో దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ వర్గాల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దిగజారుడు వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు పఠాన్ హబీబ్ ఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, నాయకులు చిన్నయ్య, విశ్వేశ్వర్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల రక్షణకు చట్టాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



మాట్లాడుతున్నలీలా వెంకట శేషాద్రి

పత్తికొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖైదీల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి అన్నారు. డిప్యూటీ లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ శివరామచంద్ర రావుతో కలసి ఆయన గురువారం సబ్‌జైల్‌ను పరిశీలించారు. 70 సంవత్సరాలు పైబడి, అనారోగ్య సమస్యలుంటే బెయిల్‌పై ఇంటికి పంపుతామన్నారు. ఖైదీలు తమ సస్యలను న్యాయ సేవాధికార సంస్థకు తెలియచేస్తే సాయం చేస్తారన్నారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలు, సౌకర్యాలు, ఆహారాన్ని పరిశీలించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గంధం వెంకటయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

కపటి నిందితులకు రిమాండ్

- గ్రామంలో కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్
- పలు చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు

-ఆదోని రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటిలో ఈనెల 14వ తేది శనివారం రాత్రి బీజేపీ నాయకుడు ఈరన్న కుటుంబంపై ఆ పార్టీకి చెందిన వారు మారుణాయుధాలతో దాడి చేసిన ఘటనలో నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. నిందితులపై సెక్షన్ 109 బిఎన్ఎస్ యాక్టు కింద హత్యాయత్నం కేసు నమోదు చేసిన ఇస్వీ పోలీసులు ఈనెల 17వ తేదిన నిందితులు బోయ ఈరమ్మ, వెంకటేశులు, వెంకటస్వామి, గోవిందరాజులు, రవి, తిరుమల, వీరేష్, గిడ్డయ్యలను అరెస్టు చేసి డోన్ జెఎఫ్‌సిఎం కోర్టుకు తరలించారు. కోర్టు ఈనెల 31వరకు రిమాండ్‌కు ఆదేశించడంతో బుధవారం అర్ధరాత్రి పోలీసులు నిందితులను ఆదోని సబ్ జైలుకు తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ నల్లప్ప, ఎస్.ఐ నాగేంద్ర భారీ బందోబస్తు నిర్వహించడంతోపాటు దాడి జరిగిన ప్రాంతంలో సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

కప్పట్రాళ్లకు సీజనల్ హాస్టల్

దేవనకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల గ్రామానికి సీజనల్ హాస్టల్ మంజూరైందని సమగ్ర శిక్ష అధికారి గీత తెలిపారు. గురువారం ఆమె గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల వివరాలు సేకరించి, హాస్టల్ నిర్వహణ పై ఉపాధ్యా యులతో మాట్లాడారు.. గ్రామంలో వలసల నేపథ్యంలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా హస్టల్లో ఉండి చదువుకోవాలన్నారు. వలసల సమస్యను దత్తపుత్రుడు ఐజీ ఆకే రవికృష్ణ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడంతో, హస్టల్ ఏర్పాటుకు కృషి చేసిన్నట్లు తెలిపారు. అలెస్కో అధికారి సురేష్‌రాజు, సీఆర్పీ గంగన్న, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం హీనత్ నాయుడు, తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారి గీత

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఆటోలోనే మృతి చెందిన వీరేష్

ఆదోని రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదోని నుంచి ఆస్పరి మండలం చిగిలి గ్రామానికి వెళుతున్న ఆటోను విరూపాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న మహారాష్ట్ర లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వీరేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఆస్పరి మండలం చిగిలి గ్రామానికి చెందిన పుష్పమ్మ, మహానంది దంపతుల కుమారుడు వీరేష్ (35)కు ఏడు సంవత్సరాల క్రితం ఆదోని మండలం హనవాళ్ గ్రామానికి చెందిన రాజేశ్వరితో వివాహమైంది. వీరేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ, భార్యను, తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. పెళ్లయిన ఆరేళ్లకు గర్భవతి అయిన రాజేశ్వరికి బుధవారం రాత్రి చిగిలిలో బంధువర్గ సమక్షంలో సీమంతం చేశారు. గురువారం ఉదయం రాజేశ్వరిని ఆమె తల్లిదండ్రులు హనవాళ్‌కు ప్రసవానికి పిలుచుకొని వెళ్లారు.

ఆ తర్వాత సీమంతానికి వచ్చిన బంధువులను తన ఆటోలో ఆదోనిలో వదిలి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, విరూపాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న మహారాష్ట్ర లారీ వచ్చి వీరేష్ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరేష్ ఆటోలోనే మృత్యు వాత పడ్డాడు. వీరేష్ మృతితో అటు చిగిలిలో ఇటు హనవాళ్‌లో విషాదం అలముకుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుక ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో ఈ నెల 16వ తేదిన క్షణికావేశంలో బామ్మర్దిని హత్య చేసిన బావను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అర్బన్ సీఐ రాము నిందితుడిని గురువారం మీడియా ఎదుట హాజరు పరిచారు. ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన షేక్ అర్షత్ వలి(32), శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన తన మేనత్త కొడుకు షేక్ షఫి గొర్రెలను మేపేవారు. వారం రోజులుగా షేక్ షఫి అతడి తమ్ముడు ముర్తుజాలు, అర్షత్‌వలి, పెద్దతిరుమలయ్య వేరువేరుగా తమ గొర్రెలను మేపుకొనేవారు. ఈ నెల 16వ తేదిన రాత్రి గొర్రెలను వేరువేరు పొలాల్లో ఉంచి కలిసి ఒక చోట చలిమంట వేసుకుని మాట్లాడుకుంటున్నారు. అయితే గొర్రెలను వేరువేరుగా మేపడంపై మద్యం మత్తులో ఉన్న అర్షత్‌అలి, షఫి మధ్య ఘర్షణ జరిగింది. ఈక్రమంలో అర్షత్ అలి చలిమంటలోని ఓ నిప్పు కర్రతో షేక్ షఫిని కొట్టాడు. దీంతో కోపోద్రిక్తుడైన షఫి అక్కడే ఉన్న గొడ్డలితో అర్షత్ తలపై బలంగా దాడి చేశాడు. దీంతో అర్షత్ గట్టిగా కేకలు వేయగా షేక్ షఫి అక్కడి నుంచి పరారయ్యాడు. సమీపంలో ఉన్న గొర్రెల కాపర్లు గాయపడిన అర్షత్‌ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెంది నట్లు వైద్యులు నిర్ధారించారు. అర్షత్ వలి భార్య నసిమూన్ ఫిర్యాదు మేరకు ఈ నెల 17న కేసు నమోదు చేసుకున్న పోలీసులు షేక్ షఫిని బుధవారం సాయంత్రం ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్ వద్ద అరెస్టు చేశారు. గురు వారం షేక్ షఫిని కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ రిమాం డ్‌కు ఆదేశించినట్లు సీఐ రాము వెల్లడించారు. ఎస్ఐలు నారాయణరెడ్డి, హుసేన్‌బాషా, ఏఎస్ఐ శంకరరెడ్డి, సంజీవుడు, కానిస్టేబుళ్లు లక్ష్మణరావు, మౌలాలి, మదర్ సాహెబ్, రవి, శివరామ్, రాజశేఖర్, స్వర్ణ ఉన్నారు.

కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు

- ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరసయ్య

కర్నూలు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య ఆరోపించారు. గురువారం కర్నూలు,నంద్యాల జిల్లాలకు సంబంధించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు ఏవీ రెడ్డి, ఆర్ఎస్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతపై 2019లో టీడీపీ ప్రభుత్వం హయంలో ఇచ్చిన సర్క్యులర్ నెం-01 అమలు చేయాలని రవాణామంత్రిని కోరడం జరిగిందన్నారు. వెంటనే ఆయన స్పందించి కేంద్ర కార్యలయంలో ఈడీ స్థాయి అధికారులకు ఆ సర్క్యులర్‌ను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినా కొంతమంది కింది స్థాయి అధికారులు మాత్రం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఉద్యోగులపై చార్జీషీట్లు, సస్పెండ్లకు పాల్పడుతూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగులకు ఆర్ఈఎంఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈయూ వినతి మేరకు నైట్‌అవుట్ అలవెన్స్‌లు ఇచ్చేలా కృషి చేసిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీలో ఉన్న అన్ని కేటగిరిలో ఖాళీలను భర్తీచేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కె.మద్దిలేటి మాట్లాడుతూ ఈహెచ్‌యస్‌తో అసలు వైద్యసౌకర్యాలు అందడంలేదన్నారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు, రిటైర్డ్ పొందిన ఉద్యోగులకు విలీనం ముందున్న పద్ధతుల్లోనే రెఫరల్ ఆసుపత్రిలో వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కడప జోన్, కర్నూలు, నంద్యాల జిల్లాల నాయకులు కె.కె.కుమార్, దేవసహాయం, రాముడు, ముత్యాలరెడ్డి, బాషా, వెంకటేశ్వర్లు, చాంద్‌భాషా, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని బంగారానికి రుణం

- ముత్తూట్ మినీ ఫైనాన్స్ ఆడిట్‌లో బట్టబయలు
- మోసగించిన సిబ్బంది, కస్టమర్లపై కేసు

ఎమ్మిగనూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తూట్ మినీ ఫైనాన్స్‌లో బంగారాన్ని కుదువ పెట్టి రూ.29 లక్షలు రుణం తీసుకున్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఆ సంస్థకు చెందిన నలుగురు సిబ్బందిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గౌస్, ఖాద్రి, ముస్తాఫ్ వివిధ సమాయాల్లో ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారాన్ని కుదువ పెట్టి రూ.29 లక్షలు రుణం తీసుకున్నారు. అయితే ఈ బంగారం తక్కువ నాణ్యతగా ఉన్నట్లు ఆడిట్‌లో గుర్తించారు. బంగారానికి ఇవ్వాల్సిన శాతం కంటే ఎక్కువ మొత్తం రుణం మంజూరైనట్లు గుర్తించారు. దీంతో ముత్తూట్ మినీ ఫైనాన్స్ ఆర్ఎం వశీకరప్ప ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ముత్తూట్ మినీ ఫైనాన్స్ ఎమ్మిగనూరు శాఖ మేనేజర్ జయరాం, సిబ్బంది రాముడు, ఉరుకుందుతో పాటు ముగ్గురు కస్టమర్లపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25న రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

ఓర్వకల్లు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో ఈనెల 25న ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్‌ను సందర్భంగా తెలుగు రాష్ట్రాల పాలపండ్ల ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు వందనాలు గురువారం తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హాజరవుతార న్నారు. పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి నుంచి ఆరు బహుమతులు వరుసగా రూ.35వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.6వేలు, రూ.4వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాల కోసం 94941 412127, 9949140245 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

గోనెగండ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం గాజులదిన్నె ప్రాజెక్టు ఎల్లెల్సీ దగ్గర వడ్డె అరవిందస్వామిపై జరిగిన హత్యాయత్నం కేసులో అతని ప్రియురాలితో పాటు మరో నలుగురిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. దాడికి పాల్పడిన వారంతా ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్, బీ ఫార్మసీ చదువుకునే విద్యార్థులు కావడం గమనార్హం. నిందితుడు ఈడిగ భరత్ ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. నిందితురాలు కూడా అదే కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఎరుకలి రామాంజనేయులు, వడ్ల కుమారస్వామి ఇద్దరు బీ ఫార్మసి చదువుతున్నారు. గంధాల ప్రశాంత్ మాత్రం 10వ తరగతి చదువుతూ నాపరాతి బండల పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం అగ్రహారం దగ్గర ఉన్న మల్లెల వంక వాగులో నిందితురాలైన యువతితో పాటు భరత్, వడ్ల కుమారస్వామి, ప్రశాంత్‌కుమార్, ఎరుకలి రామాంజనేయులు దాక్కున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి వారిని అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి ఐదు సెల్‌ఫోన్లు, వేట కొడవళ్లు, పల్సర్ మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందుతులు ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. గతంలో కూడా భరత్ గ్యాంగ్ అరవిందస్వామిని హత్య చేసేందుకు వేటకొడవళ్లు, పిడిబాకులతో ఇంటి పరిసరాల్లో తిరిగారు. అయితే అరవిందస్వామి వీరి దొరకకుండా తప్పించుకున్నాడని వివరించారు.

ఉపాధి పనుల్లో రూ.8.40 లక్షల అవినీతి



చాగలమర్రిలో సామాజిక తనిఖీ బహిరంగ విచారణ చేస్తున్న జిల్లా పీడీ, ఏపీడీలు

చాగలమర్రి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల్లో రూ.8.40 లక్షలు విచారణలో అవినీతి జరిగినట్లు జిల్లా ఉపాధి పీడీ జనార్దన్‌రావు తెలిపారు. గురువారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ విచారణ సభ నిర్వహించారు. రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ మురాద్, డీఆర్పీల ఆధ్వర్యంలో గ్రామాల్లో చేసిన ఉపాధి పనుల విచారణ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ అవినీతి జరిగిన సొమ్మును రికవరీ చేయాలని ఏపీడీలు, ఏపీవోలకు ఆదేశించారు. జిల్లాలో 2.55 లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చామని తెలిపారు. 2.10 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారని, 75 లక్షల పని దినాలకుగాను 56 లక్షల పని దినాలు కల్పించామని వెల్లడించారు. మార్చి వరకు టార్గెట్ పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీడీలు సాంబశివుడు, బాలాజీనాయక్, అన్వారాగ్‌బేగం, క్వాలిటీ కంట్రోలర్ అధికారి గంగాధర్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో మెగా వైద్య శిబిరం

శిరివెళ్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శృంగవరపు విజయ్ కుమార్, మాలపాటి పుల్లయ్య చౌదరి గురువారం తెలిపారు. హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, కర్నూలు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మండలంలోని రాజనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు వారు తెలిపారు. 25 మందితో కూడిన వైద్య బృందం రెండు రోజులపాటు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సాధారణ పరీక్షలతో పాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రజలు ఈ మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

నూతన భవనాలు నిర్మించాలి

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె కోర్టు భవనాలు పూర్తి శిథిలావస్థకు చేరాయని, కొత్త వాటిని నిర్మించాలని బనగానపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుసేన్ అన్నారు. గురువారం కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఆయన చాంబర్‌లో కలసి వినతి పత్రం సమర్పించారు. కొంత కాలంగా బనగానపల్లె కోర్టు భవనం శిథిలావస్థకు చేరడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు జిల్లా న్యాయమూర్తి దృష్టికి న్యాయవాదులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీనివాసమూర్తి, ఎం.రఘురామిరెడ్డి, జాకీర్ హుసేన్, అల్లావుద్దీన్, ఇర్ఫాన్, అబ్బాస్, రఫీ, అన్ను పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

డోన్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పీఆర్ నేషనల్ జనరల్ సెక్రటరీ రామకృష్ణాచారులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మర్రి రాఘవయ్య భవనంలో డోన్ రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లకు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్ జోనల్ సెక్రటరీ విద్యాసాగర్ డోన్ రైల్వే పెన్షనర్స్ సెల్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి రంగస్వామి, గౌరవాధ్యక్షులు చలపతిరావు, కోశాధికారి తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోను నియమించాలి

డోన్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో డిప్యూటీ డీఈవోను నియమించాలని సర్వజన విద్యార్థి సమైక్య నియోజకవర్గ అధ్యక్షుడు సుభాష్ డిమాండ్ చేశారు. గురువారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డోన్‌లో డిప్యూటీ డీఈవో పోస్టు భర్తీ కాకపోవడంతో ఉపాధ్యాయులపై పర్యవేక్షణ కొరవడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ డీఈవోను నియమించాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పాల ఉత్పత్తిదారుల ఎన్నికలు ఏకగ్రీవం

చాగలమర్రి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలోని రెండు డైరెక్టర్ స్థానాలు టీడీపీ కైవసం చేసుకుంది. రెండు డైరెక్టర్ స్థానాలకు రెండు నామినేషన్‌లు మాత్రమే వచ్చాయని ఎన్నికల అధికారి చంద్ర గురువారం తెలిపారు. పాల డెయిరీ చైర్మన్ నడిపి బాలయ్య ఆధ్వర్యంలో రెండు డైరెక్టర్ స్థానాలకు ఆదిలక్ష్మి, గురమ్మలు నామినేషన్‌లు వేశారు. రెండు స్థానాలకు రెండు నామినేషన్‌లు రావడంతో వారిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి తెలియజేశారు. టీడీపీ వర్గీయులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు పెద్దగోపాల్, వీరయ్య, బాలనరసింహుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డోన్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెంపల్లె గ్రామ టీడీపీ నాయకులు ఎస్ సుంకన్న తండ్రి పెద్ద సుంకన్న మృతి పట్ల డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్‌రెడ్డి సంతాపం తెలిపారు. సుంకన్న భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెంపల్లె జయన్న, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

రుద్రవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని జిల్లా రిసోర్స్ పర్సన్‌భాగ్యలక్ష్మి, సీడీపీవో తేజేశ్వని అన్నారు. గురువారం రుద్రవరం మండల పరిషత్ సమావేశ భవనంలో అంగన్వాడీలు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులకు వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఎఎన్ఎంలకు కిశోర వికాసంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గాయత్రి, జయలక్ష్మి, ఎంఈవో లక్ష్మి, సూపర్‌వైజరు లక్ష్మీదేవి, హెల్త్ సూపరువైజరు మల్లీశ్వరి, ఎంపీహెచ్ఈవో నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో హెడ్మాస్టర్ల ఆధ్వర్యంలో ధ్యానంపై గురువారం ధ్యాన గురువు తిరుమలయ్య అవగాహన కల్పించారు. ఈనెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా మాస్టర్లు వంశీ, శాంతి, రూపాదేవి, పీఈటీ మాస్కర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల దీపోత్సవం

బేతంచెర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయం నుంచి అయ్యప్పస్వామి మాలాదారులు దీపోత్సవం కార్యక్రమం వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి దీపోత్సవం కార్యక్రమాన్ని ఆలయం నుంచి కొత్తబస్టాండు, పాతబస్టాండు మీదుగా పట్టణ వీధుల గుండా ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల కోలాటాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుస్వాములు అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



డోన్‌లో సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మం త్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. గురు వారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంటులో రాజ్యాంగ ఆవిష్కరణ 75వ వార్షికోత్సవం సంద ర్భంగా పార్లమెంటులో అమిత్‌షా చేసిన వ్యాఖ్యల ను వారు తీవ్రంగా ఖండించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు చిన్న రెహిమాన్ పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మం త్రి అమిత్‌షా దేశ ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అమ్మ హోటల్ సర్కిల్ ప్రధాన రోడ్డులో ఆందోళన చేశారు. ఈ సందర్భం గా రామాంజనేయులు మాట్లాడుతూ అంబేడ్క ర్‌పై చేసిన వ్యాఖ్యలు అమిత్‌షా వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో మోటరాము డు, నారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

రాజ్యాంగం మార్చడానికి కుట్ర

కోవెలకుంట్ల: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భారత జాతికి క్షమాపణ చెప్పాలని ప్రజా సం ఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కొండారెడ్డి గ్రంథాలయం ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఎం నాయకులు సుధాకర్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా, రాయలసీ మ విద్యార్థి సంఘం నాయకులు ఓబులేసు, బీఎ స్‌ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్యలు మాట్లా డారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చడా నికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతోందని అన్నారు. అంబేడ్కర్‌ను అవమానిం చడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో మహేశ్, సుబ్బరాయుడు, నారాయణ, ఖాశిం, మురళీమో హన్, నరసింహులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి

చాగలమర్రి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో-1 అనూరాధ తెలిపారు. గురువారం మండలంలోని జ్ఞానాపురం, పెద్దవంగలి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యా హ్న భోజనం, రాగి జావాను పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మస్తాన్‌బాష, నబీసాహెబ్, సీఆర్పీ ఖాసీం పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని కొత్తపల్లె, గొడిగనూరు పాఠశాలలను ఎంఈవో-2 న్యామతుల్ల గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతగల భోజనం ఇవ్వాలని, విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు గురుచంద్రుడు, జాన్సన్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో అనూరాధ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శిరువెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన మధుగోపాల్(33) నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. శిరువెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన మధుగోపాల్ బనగానపల్లె టంగుటూరు గ్రామానికి చెందిన తన మేనత్త కుమార్తె అయిన మౌనికను 5 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. నెల రోజుల క్రితం భర్తతో మౌనిక గొడవపడి టంగుటూరు గ్రామానికి వచ్చి తల్లి వద్ద ఉంటోంది. జీవితంపై విరక్తి చెందిన మధుగోపాల్ టంగుటూరు గ్రామానికి వచ్చి పొలాల్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని తల్లి కేడం అచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుంప్రమాన్‌దిన్నెకు చెందిన వ్యక్తి..

శిరివెళ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శిరివెళ్ల ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపిన వివరాల మేరకు గత నెల 30వ తేదీన యర్రగుంట్లలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గోపాల్‌రెడ్డి (65) తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా గోపాల్‌రెడ్డి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

డోన్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. డోన్ మండలం ఎర్రగుంట్ల, ప్యాపిలి మండలం నేరేడుచెర్ల, బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె తండాలో దాడులు నిర్వహించి నాలుగు కేసులు నమోదు చేశారు. మూడు కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్ ఎస్ఐ సోమశేఖర్‌రావు తెలిపారు. 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డోన్ ఎక్సైజ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఈవోఆర్డీగా సతీశ్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మేజర్ గ్రామ పంచాయితీ ఈవోగా ఉన్న సతీశ్‌కుమార్‌రెడ్డిని మండల ఈవోఆర్డీగా నియమిస్తూ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో బనగానపల్లె మండల ఇన్‌చార్జి ఈవోఆర్డీగా ఉన్న సతీశ్‌కుమార్‌రెడ్డికి పూర్తి ఈవోఆర్డీగా బాధ్యతలు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు.

పారిశుధ్యం లోపించరాదు

రుద్రవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సుబ్బారావు అన్నారు. గురువారం రుద్రవరంలోని దళిత కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పనులు చేయించాలని అన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాడైన పైపులకు మరమ్మతులు చేయించి స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు.

విఘాతం కలిగిస్తే చర్యలు

చాగలమర్రి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు అన్నారు. గురువారం డి.వనిపెంటలో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని అన్నారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సర్వే వేగవంతం చేయండి

రుద్రవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మిస్సింగ్ సిటిజన్ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నాగులవరం, రుద్రవరం సచివాలయాల పరిధిలో మిస్సింగ్ సిటిజన్ సర్వేను పరిశీలించి సచివాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా ఉంచాలన్నారు.

దంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి

రుద్రవరం: విద్యార్థులు దంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి భాషా అన్నారు. గురువారం మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్య అధికారి విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేశారు. 40 మంది విద్యార్థులు, పిల్లలకు దంత వైద్యపరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆలమూరులోని ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశే లక్ష్యం

డోన్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నారనీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ అన్నారు. మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో గురువారం సాయంత్రం పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. బీసీ కాలనీలో చేపట్టిన కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో వలసల గ్రామ టీడీపీ నాయకులు వలసల బాలుడు, తదితరులు ఉన్నారు.

ఇద్దరిపై దౌర్జన్యం కేసు నమోదు

బేతంచెర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన ఎస్‌కే సలాం, సయ్యద్ ఇద్రుస్ అనే వ్యక్తులు వెంకటేశ్వర ఆచారిని డబ్బులు అప్పుగా ఇవ్వాలని అడిగారు.. తమ వద్ద లేవని చెప్పడంతో ఆ ఇద్దరు వ్యక్తులు వెంకటేశ్వర ఆచారి భార్య విమల కుమారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జేసీ విష్ణుచరణ్‌తేజ

జేసీ విష్ణుచరణ్ తేజ



పెద్ద చింతకుంట్లలో అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో విశ్వనాథ్

దొర్నిపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యో తి):: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తేజ అన్నారు. గురువారం మండలంలోని బుర్రారెడ్డిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతుల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యం అన్నారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, సర్పంచ్ గుండ్రాతి సుబ్బయ్య, వీఆర్వో నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ (శిరివెళ్ల): గ్రామాల్లోని రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సభలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ అన్నారు. ఆళ్లగడ్డ మండలం పెద్ద చింతకుంట్ల గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి వచ్చిన అర్జీలు ఆయన పరిశీలించారు. రీ సర్వేకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని రైతుల నుంచి వినతులు ఎక్కువగా వస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి, మండల సర్వేయర్ రవి ప్రకాష్ పాల్గొన్నారు.

● **రుద్రవరం:** భూమిని కృత్రిమంగా సృష్టించలేమని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ అన్నారు. గురువారం మండలంలోని పేరూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని సృష్టించలేమని, రైతులు దస్తావేజుల్లో ఉన్న భూమికి సరిహద్దులు చూయించుకుని రాళ్లు పాతించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖరయ్య, డీఆర్వోలు నీలకంఠేశ్వర్, చంద్రమోహన్, పుల్లయ్య, సర్వేయరు రమణ పాల్గొన్నారు.

● **బనగానపల్లె:** రెవెన్యూ సదస్సులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నందివర్గం, రామతీర్థం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో నందివర్గం సర్పంచ్ ఉమామహేశ్వరరావు, వల్లెపు శంకర్, ఆర్ఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

● **కోవెలకుంట్ల:** గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం వెల్లటూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో రైతులు దరఖాస్తు చేసుకున్న అర్జీలు పరిశీలించి వాటన్నింటినీ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, మండల సర్వేయరు వీరన్న, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

● **చాగలమర్రి:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ అన్నారు. గురువారం మండలంలోని నేలంపాడులో జరిగే రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దా ర్ రవికుమార్, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్వేయర్ మద్దిలేటి, వీఆర్వోలు శ్రీనివాసులు, శిఖామణి, పద్మశేఖర్, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

సంజామల: రీ సర్వే సమస్యలకు త్వరలో మోక్షం లభిస్తుందని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో ఏర్పాటైన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్లు మల్లేశ్వరీ, క్రిష్ణయ్య, వీఆర్వో ఎరుకలయ్య, ఏఎస్ఐ నాగరాజు, టీడీపీ నాయకులు బండి ప్రతాప్ రెడ్డి, మూరబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం టెక్స్‌టైల్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయాన్ని కలెక్టరు రాజకుమారి గణియా గురువారం రాత్రి తనిఖీ చేశారు. సొసైటీలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. కోఆపరేటివ్ భవనం పతనావస్థలో ఉండడంతో పునర్నిర్మించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ఏడీ నాగరాజారావు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారి ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు బండా సుబ్బారావు, కాల్వ సీతారామయ్య, అవ్వారి రాముడు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలని జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి అజాంబిక్ గురువారం అన్నారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు స్వీకరణ కార్యక్రమం బనగానపల్లె మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వాలు నమోదు చేసి సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా అజాంబిక్ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో కొత్తగా ప్రారంభించబోతున్న జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా సీనియర్ ఉపాధ్యాయులను నియమించాలని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అమర్, వెంకటేశ్వరరెడ్డి, గోపాలకృష్ణుడు, మహబూబ్‌బాషా, లతీఫ్, శ్రీనివాసరెడ్డి, హరిప్ర సాద్, మదన్‌గోపాల్, నాగరాజు, రంగస్వామి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులకు కల్పించాలని ఎస్టీయూజిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో అమీర్, వెంకటేశ్వరరెడ్డి, గోపాలకృష్ణుడు, మహబూబ్ బాషా, లతీఫ్, శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, మదనగోపాల్, నాగరాజు, రంగస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పందుల యజమానులకు నోటీసులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పందుల బెడదపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో కదిలిన అధికారులు గురువారం పందుల నివారణ కోసం చర్యలకు ఉపక్రమించారు. ఎంపీడీవో ప్రసాదరెడ్డి, తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి పోలీసులతో కలిసి పందుల యజమానులతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల్లోగా పందులను బయటికి తరలించాలని ఆదేశాలిస్తూ పందుల యజమానులకు నోటీసులు ఇచ్చారు. గడువులోగా పందులను తరలించకపోతే తామే స్వయంగా రంగంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

రబీ పంటలకు బీమా చెల్లించాలి

బనగానపల్లె, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి రబీ పంటలకు ఈ నెలాఖరులోగా బీమా చెల్లించాలని బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. ఎకరా వేరుశనగ పంటకు రూ.64, జొన్న పంటకు రూ.60, మినుములకు రూ.48, ఉల్లికి రూ.90, వరికి రూ.126, శనగకు రూ.84 బీమా చెల్లించాలన్నారు. ప్రీమియం రబీలో వేసిన పంటలకు చెల్లించాలన్నారు. ఈ నెల 31 లోగా ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కోవెలకుంట్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఓటరు నమోదు చేసుకోవాలని కోవెలకుంట్ల తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టరు, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువతీ యువకులు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు స్థానిక బీఎల్‌వో ద్వారా కానీ ఆన్‌లైన్‌లో కానీ ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక

కొలిమిగుండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో ముస్లిం, మైనారిటీ గ్రామ కమిటీలను ఎన్నిక చేయనున్నట్లు మండల ప్రభుత్వ ఖాజీ ఖాదర్‌వలి బుధవారం వెల్లడించారు. ఆయా గ్రామాల్లో ముస్లిం మత పెద్దలతో కలిసి గ్రామ కమిటీలు వేస్తామని, అనంతరం మండల కమిటీ ఎంపిక ఉంటుందన్నారు. ముస్లింలు సహకరించాలని కోరారు.

మోడల్ పేపరు ఆవిష్కరణ

డోన్ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన ఎస్ఎస్‌సీ మోడల్ పేపరును ఆవిష్కరించారు. ఈ మోడల్ పేపర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని యుటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, మాణిక్యం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

రుద్రవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంటు ఆఫీసరు నాగసువర్చల అన్నారు. గురువారం రుద్రవరం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు రాసే పరీక్ష సరళిని పరిశీలించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులతో జీసీడీవో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు విద్యార్థినులకు సూచనలు, సలహాలు అందించారు. పాఠశాల ఆవరణలోని స్టోర్ రూము, వంట గది పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సక్రమంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్టాండులో మరుగుదొడ్లకు తాళాలు

అవుకు, డిశంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అవుకు బస్టాండులో మరుగుదొడ్లకు వేసిన తాళాలు తీయాలని ఏఐటీయూసీ మండల సెక్రటరీ నాగాంజనేయులు అన్నారు. గురువారం ప్రయాణికులతో కలిసి మరుగుదొడ్ల ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లకు తాళాలు వేయటం సమంజసం కాదన్నారు. మరుగుదొడ్ల వద్ద పని చేస్తున్న ఇద్దరు మహిళలు గొడవపడి తాళాలు వేయటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

రక్తదానంతో పునర్జన్మ

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా పునర్జన్మ దక్కుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల బాషా అన్నారు. పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన షేక్.హలీఫా మూడో వర్ధంతి సందర్భంగా తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు, గర్భిణులకు ఆళ్లగడ్డ బ్లెడ్ డోనర్స్ టీమ్ సహకారంతో కుటుంబ సభ్యులు గురువారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లెడ్ డోనర్స్ టీమ్ అధ్యక్షుడు మహమ్మద్‌హుసేన్, ప్రవీన్, మనోహర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కొలిమిగుండ్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు క్రాస్ సర్కిల్ వద్ద సీఐ రమేష్‌బాబు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించరాదని అన్నారు.

పంట సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి: డీఏవో


గడిగరేవులలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో మురళీకృష్ణ

గడివేముల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని గడిగరేవుల, గ్రంధివేముల, చిందుకూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, సోయా పంటలను పరిశీలించారు. జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈనెల 31వ తేదీ వరకు పంట బీమా గడువు పెంచారని తెలిపారు. రైతులు ప్రీమియం చెల్లించి పంట బీమా చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బందికి ఈ-పంట, పీఎం కిసాన్, పొలం పిలుస్తోంది, కౌలు రైతుల రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని దుర్గాభవాని, వెంకటేశ్వర ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ధరల పట్టికను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల విక్రయాల గురించి రికార్డులను సక్రమంగా నిర్వహించాల న్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ


శ్రీవారి రూపంలో రాశిగా పోసిన పులిహోర నైవేద్యం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం పురస్కరించుకొని నంద్యాల సంజీవనగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయంలో వేంకటేశ్వర స్వామికి తిరుప్పావడ సేవను వైభవంగా నిర్వహించారు. గురువారం అర్చకులు శ్రీకాంత్ శర్మ, తరుణ్‌కుమార్ శర్మ వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. డాక్టర్ దివి హయగ్రీవాచార్యుల విశ్లేషణతో, అర్చకులు గోవిందనామాలతో, వేదవచనాలు, మంత్రపుష్పం, వేద ఆశీర్వాదంతో భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవను నిర్వహించారు. స్వామికి అత్యంత ప్రీతికరమైన పులిహోరను రాశిగా పోసి శ్రీవారి ప్రతిబింబంగా తీర్చిదిద్ది, అప్పం, జిలేబి, కూరగాయలు, ఫలాలతో సుందరంగా అలంకరించి వేదమంత్రాలతో నివేదన ఇచ్చి నైవేద్యంగా సమర్పించారు. భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు శ్రీనివాస్, పార్థసారధికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

'భక్తులకు మెరుగైన సౌకర్యాలు'


డీఈఈతో మాట్లాడుతున్న ఈవో

మహానంది, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు దేవదాయశాఖ డీఈఈ శ్రీనివాసప్రసాద్ గురువారం మహానందికి వచ్చారు. ఈసందర్భంగా ఈవోను కలిశారు. ఈవో ఆలయ పరసరాల్లో రూ.10.50 కోట్లతో నిర్మిస్తున్న 55 గదుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని డీఈఈతో మాట్లాడారు. ఇందులో 44 సాధారణ గదులతో పాటు 11 సూట్ రూమ్‌లు నిర్మిస్తున్నట్లు ఈవో చెప్పారు. ఇప్పటికే పోచా విశ్రాంతి భవనాన్ని ఉపయోగంలోకి తెచ్చి భక్తులకు ఉచితంగా విశ్రాంతి తీసుకొనేందుకు ఇస్తున్నామని తెలిపారు. దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

'పాఠశాల అభివృద్ధికి సహకరించాలి'


ఎంఈవో సుభాన్, నాగిరెడ్డిని సన్మానించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నందికొట్కూరు ఎంఈవో సుభాన్ సూచించారు. మండలంలోని వడ్డెమాను జడ్పీ హైస్కూలులో క్రీడా మైదానాన్ని రూ.50 వేల ఖర్చుతో బాగు చేయించిన పాఠశాల పూర్వ విద్యార్థి నాగిరెడ్డితో పాటు ఎంఈవో సుభాన్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థి నాగిరెడ్డి భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. నాగిరెడ్డి మాట్లాడుతూ మన ఊరు, మన బడిని అభివృద్ధి చేసుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో కూర్చోడానికి హాలు, సైకిల్ పార్కింగ్ చేసుకోవడానికి షెడ్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. హెచ్‌ఎం జుబేదా, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, ఫిజికల్ డైరెక్టర్ రాజేశ్వరీదేవి, రామకృష్ణ, రఫీ, అల్లీహుశేన్ పాల్గొన్నారు.

వైదిక పద్ధతిలో పూజలు నిర్వహించాలి: ఈవో

మహానంది, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో వైదిక పద్ధతిలో అర్చకులు పూజా విధానాలను పాటించాలని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి సూచించారు. గురువారం మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆలయ వేద పండితులతో పాటు అర్చకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే తొలి ఏకదశితో పాటు అన్నాభిషేకాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే ఫిబ్రవరిలో జరిగే మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను గతంలో మాదిరి 5 రోజులు కాకుండా 9 రోజులు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే అనే అంశంపై ప్రధానంగా చర్చించారు. భక్తుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి: పీఆర్ డీఈ


తిరుపాడులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ గంగాధర్

గడివేముల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఆర్ డీఈ గంగాధర్ ఆదేశించారు. మండలంలోని దుర్వేసి, తిరుపాడు, గడివేముల, సోమాపురం గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. రోడ్డు నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు అమానుషం'



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కించపరిచేలా కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు స్వాములు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు భాస్కర్ అన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఆత్మకూరులోని పాతబస్టాండ్‌లో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తక్షణమే ఆయన్ని పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని అన్నారు. అదేవిధంగా కేంద్ర మంత్రి అమిత్‌షా తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సుధాకర్, రామ్‌నాయక్, రణధీర్, సురేంద్ర, ఇస్మాయిల్, మహ్మద్, వెంకటేశ్వర్లు, దినేష్ ఉన్నారు.

'ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం'


పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

వెలుగోడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని గుంతకందాల గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వరి పంటను పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుబ్బరాయుడు అనే రైతు పొలంలో ప్రకృతి వరిపైరును ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఎకరాకు 47 బస్తాల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో అంజిత్ కుమార్ రెడ్డి, అప్సర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహబూబ్‌బాషా, నజీర్, నాగరాజ్, రైతులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం

● పూర్వ విద్యార్థి, టీటీడీ ఏఏవో బాలగోవింద్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాలగోవింద్

పగిడ్యాల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాతో చదివితే విజయం సాధించవచ్చని టీటీడీ ఏఏవో బాలగోవింద్ విద్యార్థులకు సూచించారు. పరీక్షలకు సన్నద్ధంపై పగిడ్యాల జడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తాను కూడా ఈ పాఠశాలలోనే చదువుకొని ఉన్నతమైన ఉద్యోగం సాధించానని చెప్పారు. పరీక్షలపై ఎలాంటి భయం వద్దని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం బాలగోవిద్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు రషీద్‌మియ్య, రమణరావు, పీతాంబరరెడ్డి తదితరులు ఉన్నారు.

సచివాలయాల తనిఖీ


కడుమూరులో రికార్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

మిడుతూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూటి, చింతలపల్లి చౌట్కూరు, దేవనూరు, కడుమూరు గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో దశరథరామయ్య గురువారం తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేర్లు తొలగింపు అయివారిని గుర్తించి మరలా వారి జాబితాను రికార్డులో నమోదు చేయాలని అన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో కోరారు. గ్రామంలో చిరు, చిన్న, మీడియం, ఎంటర్ ప్రైజస్ వ్యాపారును గుర్తించి వారిని ఆన్‌లైన్ పొందు పరచాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

నందికొట్కూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాల యాజమాన్యం కెనడీ, నిర్మల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'జయప్రదం చేయాలి'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని యాగంటిలో జనవరి 6,7,8 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంయలో ఈ కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాగంటిలో మూడు రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో విద్యా వ్యతిరేక అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. అలాగే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ తరగతులకు ప్రముఖ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు రానున్నారని తెలిపారు. ఈ తరగతులకు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రశాంత్, సాయి, అంజి, బాలాజి, రవి, వంశీ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



అల్లూరులో మాట్లాడుతున్న మాండ్ర సురేంద్రనాథరెడ్డి

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామాలలో రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథరెడ్డి కోరారు. రెవెన్యూ అధికారులు గ్రామ స్థాయిలో రైతుల సమస్యలను గుర్తించాలన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, వీఆర్వోలు స్వామన్న, స్వాములు, నరసింహ, మనోహర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా భూసమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. గురువారం మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామ సచివాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ నక్క విజయకుమార్ అధ్యక్షతన తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వోలు మౌలాలి, వేణుగోపాల్‌గౌడు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, డిజిటల్ అసిస్టెంట్ పవన్ కళ్యాణ్, టీడీపీ నాయకులు శివారెడ్డి, ఏఎస్ రాజు, తెలుగు మల్లయ్య రైతులు పాల్గొన్నారు.

మహానంది(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బారావు తెలిపారు. గురువారం మహానంది మండలం గోపవరం గ్రామంలో వీఆర్వో వెంకటరాముడు అధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ రమాదేవి హాజరయ్యారు. కార్యక్రమంలో తెలుగుగంగ డీసీ-3 అధ్యక్షుడు క్రాంతికుమార్ యాదవ్, గ్రూపు దేవాలయాల ఈవో వేణునాథరెడ్డి, భైరవాణి చెరువు అధ్యక్షుడు కొశెట్టి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు సీహెచ్ రాముడు, నందిరెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు(ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. గురువారం మండలంలోని జూటూరు గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో చుక్కల భూములు ఆన్‌లైన్ చేయాలని, మరికొంత మంది రైతులు తమ పొలాలను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని, మ్యూటేషన్ చేయాలని కొరుతూ అర్జీలు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఖాజాబీ, వీఆర్వో సామేలు, సిబ్బంది, రైతులు, రైతులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్

నంద్యాల క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు గడచిన 24గంటల్లో జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టినట్లు పోలీస్ అధికారులు గురువారం తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మద్యం, ఇసుక, గంజాయి ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా చూడటంకోసమే విజిబుల్ పోలీసింగ్ నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ అధికారులు, వారి సిబ్బంది సహాయంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రజలు ఎవరూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. మీ వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, బ్యాంక్ వివరాలు, ఫొటోలు, ఆధార్ తదితర వివరాలు ఎవరికీ పంపవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయినట్లయితే వెంటనే 1930 నెంబర్‌కు, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో గానీ, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లోగాని ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఎంవీఐ చట్టాన్ని ఉపయోగించి గత 24గంటల్లో డ్రైవింగ్ లైసెన్స్, సరైన ధ్రువపత్రాల్లేని 413మందిని గుర్తించి రూ.1,51805జరిమానా విధించామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే 15మందిని గుర్తించి వారినుంచి వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 72కేసులు, బహిరంగ ప్రదేశంలో ధూమపానం చేస్తున్నవారిపై 52కేసులు నమోదు చేసి రూ.4,250 జరిమానా విధించామన్నారు. బనగానపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో జూదం ఆడుతున్న 8మందిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.4,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డోన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా ఆడుతున్న వ్యక్తిని అరెస్టుచేసి అతడివద్దనుంచి రూ.1180స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యం నియంత్రించడంలో మూడు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టుచేసి వారి నుంచి 10మద్యం బాటిళ్లు, 80లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం చెంచు రైతులకు వంద శాతం సబ్సిడీతో ఐటీడీఏ ప్రాజెక్టు కింద పలు పథకాలు ప్రవేశ పెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి ధనుంజయ, ఉద్యానవన శాఖ అధికారి చందన సూచించారు. కరివేన గ్రామంలో గురువారం ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు, గిరిజన రైతులకు అందించే సబ్సిడీపై అందించే పథకాల గురించి వివరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన రైతులు, ఉద్యావన రైతులకు ఉపాధి హామి పథకం ద్వారా ఉద్యానవనాల పెంపకానికి అవకాశం కల్పించిందని చెప్పారు. అనంతరం మిరప రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, బీఏఐఎఫ్ ఎన్జీవో సభ్యులు, ఎంపీఈవోలు, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజారోగ్యంలో భాగస్వామ్యం కావాలి'

పాణ్యం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంలో ఫార్మసిస్టులు భాగస్వామ్యం కావాలని శాంతిరాం వైద్యశాల కంటి వైద్య విభాగం అధ్యాపకుడు డాక్టర్ గిడ్డయ్య సూచించారు. శాంతిరాం ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానోత్సవం

శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌డీసీ (నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) స్పాన్సర్డ్ కోర్సుల సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. ఐవోటీ, డొమైన్ స్పెషలిస్ట్, ఏ1 డేటా క్వాలిటీ అనలిస్ట్ వీఎల్ ఎస్ఐ కోర్సులను విజయవంతం చేసిన 206మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, శిక్షకులు రాంబాబు, జావీద్ బాషా, చైతన్య, షర్మిలాదేవి, భాస్కర్, నాగమణి, డాక్టర్ సౌమ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'అమరుల త్యాగాలు చిరస్మరణీయం'


అమరవీరుల సంచికను ఆవిష్కరిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్‌వారిని ఎదుర్కొని అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు మహమ్మద్ అబులైస్, అబ్దుల్‌సమ్మద్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాఖుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా గురువారం జేఏసీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. అష్ఫాఖుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆప్‌కీ ఆవాజ్ వెలువరించిన అమరవీరుల ప్రత్యేక సంచికను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ సద్దాంహుసేన్, అబ్దుల్‌మునీర్, మస్తాన్‌వలి, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు పాణ్యం రైల్వే గేటు మూసివేత

పాణ్యం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాణ్యం రైల్వే గేటును శుక్రవారం మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ నంద్యాల బనగానపల్లెకు వెళ్లే వాహనదారులు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 24 గంటలపాటు ఇతర రహదారుల ద్వారా ప్రయాణించాలని కోరారు. రెండో రైల్వే మార్గ నిర్మాణ పనుల నిమిత్తం మూసివేస్తున్నట్లు తెలిపారు. వాహనాదారులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలు

పాణ్యం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాణ్యం డొంగు వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థిని గాయపడినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. రెండో సంవత్సరం బి.ఫార్మసీ విద్యార్థిని హరిప్రియ కళాశాల నుంచి ఇంటికి వెళ్తూ జాతీయ రహదారి దాటుతుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపుకు వెళ్లే మోటారుసైకిల్ ఢీకొనడంతో విద్యార్థిని తలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. విద్యార్థినిని శాంతిరాం వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

'శిక్షణ తరగతులను వాయిదా వేయాలి'

ఆత్మకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల వృత్యంత శిక్షణలో భాగంగా ఆరో విడత ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులను వాయిదా వేయాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంపకీర్‌రెడ్డి, సయ్యద్ చాంద్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వీ భాస్కరరెడ్డి, గౌరవాధ్యక్షుడు భార్గవ రామయ్య కోరారు. గురువారం వారు మాట్లాడుతూ డిసెంబరు చివరి వారంలో క్రిస్మస్ పండుగతో పాటు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో డిసెంబరు 23 నుంచి 28వ తేది వరకు తలపెట్టిన ఆరో విడత ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా తరగతులను వాయిదా వేయాలని కోరారు. అదేవిధంగా క్రైస్తవ ఉపాధ్యాయులు ఐచ్ఛిక సెలవులను వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే జూలై 2023 నుంచి 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని అన్నారు. డీఎస్సీ- 2023 వారికి అందించాల్సిన పాత పెన్షన్ విధానాన్ని మంజూరు చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి కారుణ్య నియామకాలు చేపట్టాలని, సమగ్ర శిక్షా పరిధిలోని ఉద్యోగులకు ఉద్యోగులకు ఎంటీఎస్ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.